నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా 11 కేవీ కొండాపూర్ వ్యవసాయ ఫీడర్, 11 కేవీ ఎన్‌టీపీసీ ఫీడర్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ఘట్‌కేసర్ ఏఈ యశ్వంతకుమార్ తెలిపారు. కొండాపూర్ వ్యవసాయ ఫీడర్ పరిధిలో ఉదయం 10.00 నుంచి ఒంటి గంట వరకు, 11 కేవీ ఎన్‌టీపీసీ ఫీడర్ పరిధిలోని పవన్‌గ్రిడ్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పౌర హక్కుల దినోత్సవ అవగాహన సదస్సు



కీసర: పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా కీసరలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కల్పించిన హక్కుల గురించి అవగాహన కల్పించారు. కీసర ఆర్‌ఐ విశ్వనాథ్, ఎస్‌ఐ హరిప్రసాద్, మాజీ కౌన్సిలర్ హరిబాబు, రాజు, సాయిరాజ్, మాజీ ఎంపీటీసీ పంగ ముత్యాలు, అంబేడ్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగం, మల్లేష్, వామన్‌రావు, అశోక్, సోమయ్య, రవీందర్, రమేష్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి డబుల్ బెడ్రూమ్ ఇళ్ల షాపింగ్ కాంప్లెక్స్ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పల్లపు యాదగిరి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్ సోమవారం యాదగిరికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఉప్పల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ సత్యానగర్‌లో నివాసం ఉండే సంపత్ నాగోల్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఆఫీస్‌బాయ్‌గా పనిచేస్తున్నాడు. తన ద్విచక్ర వాహనం (టీజీ34ఏ 6210) పై సోదరుడితో కలిసి ఆఫీస్‌కు వెళ్తున్నాడు. కాగా శాంతినగర్‌లోని భగాయత్‌లోకి వస్తున్న సమయంలో ఎన్‌జీఐటీ కళాశాల బస్సు (టీఎస్05యూఏ5677) వెనుక నుంచి ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలైన అతడిని ఉప్పల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అట్రాసిటీ కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

అల్వాల్: అట్రాసిటీ కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్ష రూ.11 వేల జరిమానా విధించింది. నేరెడ్‌మెట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత నేరెడ్‌మెట్‌లో నివాసం ఉండే సన్యాసిరావు (52), స్థానికంగా నివసించే 42 ఏళ్ల మహిళను పరిచయం చేసుకుని శారీరక సంబంధం ఏర్పరచుకున్నాడు. అనంతరం మహిళను మోసం చేయడంతో పాటు కులం పేరుతో దూషించాడు. దీంతో బాధిత మహిళ 2020 సెప్టెంబర్ 29న నేరెడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేశారు. విచారణ చేపట్టిన రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ స్పెషల్ కోర్టు సోమవారం నిందితుడికి శిక్షను విధించినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి అదృశ్యం



గోపిచంద్

మేడిపల్లి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆంజనేయనగర్‌లో గోపీచంద్(22) అనే యువకుడు తన మామతో కలిసి ఉంటున్నాడు. కాగా 28న మధ్యాహ్నం ఎవ్వరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఫోన్ చేయగా.. స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో కుటుంబసభ్యులు తెలిసిన చోట వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు సోమవారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రేడ్ లైసెన్స్ జారీలో దందా!

వ్యాపార సముదాయాలు, లైసెన్స్ జారీలో వ్యత్యాసం

- ఆదాయ వనరుల పెంపునకు అవకాశం
- గండికొడుతున్న పలువురు ఉద్యోగులు
- ఆదాయం కోల్పోతున్న గ్రేటర్ శివారు పురపాలికలు
- కొలతలు లేకుండానే ఒకే తరహా లైసెన్స్
- ఏటా పునరుద్ధరణ తప్పనిసరి
- పట్టించుకోని పురపాలిక యంత్రాంగం



సాక్షి,సిటీబ్యూరో: నగర శివారు పురపాలక సంఘాల పరిధిలో వివిధ రకాల వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఉన్నప్పటికీ..ఆ స్థాయిలో ట్రేడ్ లైసెన్సులు జారీ కావడం లేదు. దీంతో పురపాలక సంఘాలకు ఏటా ఆదాయానికి భారీగా గండి పడుతోంది. నిబంధనల ప్రకారం ఏ దుకాణం నడపాలన్నా.. వ్యాపారులు మున్సిపాలిటీలకు తగిన రుసుం చెల్లించి ట్రేడ్ లైసెన్స్ పొందాల్సి ఉంటోంది. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని పురపాలక సంఘాల్లో ట్రేడ్ లైసెన్సుల జారీకి పుర యంత్రాంగం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినప్పటికీ, లక్ష్యాన్ని అధిగమించడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

ఫీజుతో పాటు అదనంగా ..

గ్రేటర్ శివారులో 31 పురపాలక సంఘాల (పెరిగిన మూడింటితో కలిపి) పరిధిలోని దుకాణాలు, హోటళ్లు, ఆసుపత్రులు, ఇతర షాపింగ్ మాల్స్ వంటి అన్ని రకాల దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. వీరంతా ఆన్‌లైన్ ద్వారా అనుమతులు పొందుతున్నారు. రహదారులను బట్టి పొడవు, వెడల్పు ఆధారంగా పన్ను వసూలు చేయాల్సి ఉంటోంది. కానీ నగర శివారు పరిధిలో వందలాదిగా మాంసం దుకాణాలు ఉండగా పొడవు, వెడల్పు కొలతలు లేకుండానే రూ. 1000 చొప్పున నిర్ణయించి...అదనంగా ఒక్కో దుకాణానికి రూ.700 వసూలు చేస్తున్నట్లుగా సంబంధిత మాంసం దుకాణాదారులు పేర్కొంటున్నారు. ఇతర వ్యాపార, వాణిజ్య సముదాయాల ట్రేడ్ లైసెన్స్‌ల జారీలోనూ ఇదే తరహా పరిస్థితి నెలకొందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పునరుద్ధరించుకోక..

వ్యాపారం నిర్వహించాలంటే ట్రేడ్ లైసెన్స్ పొందాల్సి ఉంటోంది. రుసుం విధింపులో ఇటీవల కొత్త విధానం అమల్లోకి వచ్చింది. చదరపు అడుగుకు రూ.5 చొప్పున నిర్ణయించారు. సాధారణంగా షోరూంలు, మిల్లులు, సరకు నిల్వ చేసే హోల్‌సెల్ వ్యాపార, వాణిజ్య భవన సముదాయాల విస్తీర్ణం ఎక్కువగా ఉంటోంది. కొత్త విధానంలో మదింపు చేస్తే వీరు రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు చెల్లించాల్సి ఉంటోంది. కానీ కొందరు రుసుం తక్కువగా ఉన్నప్పుడు లైసెన్స్ పొంది తిరిగి పునరుద్ధరించుకోవడం లేదని తెలుస్తోంది.

ట్రేడ్ లైసెన్సు లేనివెన్నో..

నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లో 4,854 వ్యాపార సముదాయాలకు 2,935 మాత్రమే ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేసినట్లు తెలుస్తోంది. అలాగే పోచారం మున్సిపాలిటీలో 511 సముదాయాలకు 273, బోడుప్పల్‌లో 2035 సముదాయాలకు 455 మాత్రమే ట్రేడ్ లైసెన్సు పొందాయి. జవహర్‌నగర్‌లో 750 కి 282, దుండిగల్‌లో 1248 కి 432, కొంపెల్లిలో 1047 కి 256, నాగారంలో 1211 కి 265 మాత్రమే లైసెన్స్‌లు ఉన్నాయి. ఇదే పరిస్థితి శివారుల్లోని మిగితా పురపాలక సంఘాల్లోనూ నెలకొందన్న ఆరోపణలు ఉన్నాయి. బ్యాంక్‌లో రుణం తీసుకున్న వారు తప్ప మిగతా వ్యాపార సముదాయాలకు సంబంధించిన వారు ట్రేడ్ లైసెన్స్ పొందేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో పురపాలక సంఘాల ఆదాయానికి భారీగా గండి పడుతోంది. రోజురోజుకూ వ్యాపార, వాణిజ్య సంస్థలు పెరిగిపోతున్నా..చాలామంది నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్ పొందడం లేదు.

విలీన జీపీల్లో అంతే..

శివారు పురపాలక సంఘాల పరిధిలోని విలీన గ్రామాల్లోనూ పెద్ద సంఖ్యలో దుకాణాలు, వ్యాపార వాణిజ్య సంస్థలు పెరుగుతూనే ఉన్నాయి. గతంలో ఉన్నప్పటికీ రెట్టింపు సంఖ్యలో కొత్తగా దుకాణాలు, వాణిజ్య వ్యాపార సంస్థలు వెలిశాయి. ఇందులో చాలా వాటికి ట్రేడ్ లైసెన్స్ లేకుండానే నిర్వహిస్తున్నారు.

భవిష్యత్ శాస్త్రవేత్తలుగా విద్యార్థులు ఎదగాలి



విద్యార్థులతో ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్.ఆర్.శ్రీనివాస్

మేడ్చల్: విద్యార్థులు భవిష్యత్ శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ ఆర్. శ్రీనివాస్ ఆకాంక్షించారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం– 2025ను పురస్కరించుకుని మేడ్చల్‌లోని పాపరాయ విద్యానికేతన్ స్కూల్‌లో సోమవారం విద్యార్థులకు 'అంతరిక్షం స్పేస్ ఆన్ వీల్స్' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఎస్.ఆర్.ఎస్.సీ ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ ఆర్. శ్రీనివాస్, మండల విద్యాధికారి శంకరయ్యలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. డాక్టర్ ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రజలలో ఇస్రో చేపట్టిన కార్యకలాపాలు, వాటి విజయాల గురించి అవగాహన కల్పిస్తూ.. నేటితరం విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విజ్ఞానాన్ని పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఉపయోగపడతాయన్నారు. స్కూల్ డైరెక్టర్, ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఎంఈఓ శంకరయ్య, కోశాధికారి గిరిబాబు, మండల జనరల్ సెక్రటరీ రాధాకృష్ణ, కేఐ.ల్యాబ్స్ సీఈఓ కరీం ఇమ్రాన్, స్కూల్ డైరెక్టర్లు నరసింహులుగౌడ్, భూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న సన్‌రైజ్ చారిటబుల్ సభ్యులు

ఘట్‌కేసర్: అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదకు ఎన్ఎఫ్‌సీనగర్ సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అండగా నిలిచారు. పెద్దేముల్ గ్రామానికి చెందిన కిరణ్ దినసరి కూలీ. కాగా ఊపిరితిత్తుల్లో గడ్డ ఏర్పడటంతో చికిత్స కోసం ఆసుపత్రిలో చేరాడు. పేద కుటుంబం కావడంతో ఆదుకోవాలని బాధితుడి విన్నపం మేరకు ఎన్ఎఫ్‌సీనగర్ సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు రూ. 20 వేల చెక్కును సోమవారం అందజేశారు. ట్రస్ట్ సభ్యులు శరబందు, సుందర్ రావు, శ్రీకాంత్, వీరారెడ్డి, రామయ్య, కృష్ణ, రమేష్, అజయ్, ప్రభుకుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉద్యమకారుల హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న మాజీ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి అన్నారు. సోమవారం నాగారం మున్సిపాలిటీలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో శాంతియుత దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి మాజీ చైర్మన్ చంద్రారెడ్డి హాజరై సంఘీభావం తెలిపారు. మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్, నక్క కిషోర్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, నాగరాజుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలి

మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి



సాక్షి, సిటీబ్యూరో: నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల నుంచి వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేందుకు సంబంధిత శాఖల జిల్లా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ.. ప్రజావాణిలో ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ సమస్యలు, భూభారతి, మున్సిపాలిటీలు, వివిధ రకాల పెన్షన్లు, ల్యాండ్ అండ్ సర్వే, శిశు, వయోవృద్ధుల సంక్షేమశాఖ, జిల్లా కో–ఆపరేటివ్‌శాఖ, కరెంట్, ఇతర శాఖలకు సంబంధించి 97 అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. పెండింగ్ ఉంచొద్దు..

దరఖాస్తులను క్షుణంగా పరిశీలించి, పెండింగ్ లేకుండా తక్షణం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణి నిర్వహణ ప్రధాన ఉద్దేశం ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కారం చేయడమేనన్నారు. తిరస్కరణకు గురైన దరఖాస్తులపై రిమార్కులు రాయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, డీఈఓ విజయకుమారి, డీఎం సివిల్ సప్లై అధికారి సుగుణబాయి, డీఎస్ఓ శ్రీనివాస్‌రెడ్డి, గృహ నిర్మాణశాఖ పీడీ రమణామూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

3 నెలల నుంచి బిల్లులు రాలేదు..

మేడ్చల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులకు 3 నెలల నుంచి జీతాలతో సహా వారు పెట్టిన పెట్టుబడి బిల్లులు రాలేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కోశాధికారి ఉన్నికృష్ణన్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రతి నెల బిల్లులు ఇవ్వకుండా విద్యార్థులకు భోజనం, గుడ్లు ఎలా పెడతారని ప్రశ్నించారు. భోజన కార్మికులు అప్పులపాలవుతున్నారని, కలెక్టర్ జోక్యం చేసుకుని వారికి రావాల్సిన జీతాలతో సహా 3 నెలలు బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు.

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి !

కుషాయిగూడ: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని కుషాయిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు అన్నారు. సోమవారం ఈసీఐఎల్‌లో వాహనదారులకు ట్రాఫిక్‌రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వాహనదారులతో హెల్మెట్లు కొనుగోలు చేయించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.



ఉద్యోగ విరమణ చేసిన ఎస్సైని సత్కరిస్తున్న అడిషనల్ డీసీపీ, పోలీస్ సిబ్బంది

ఆత్మీయ వీడ్కోలు

ఘట్‌కేసర్: ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పనిసరని అడిషనల్ డీసీపీ వెంకటరమణ అన్నారు. ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన తోట మహేందర్ వీడ్కోలు సమావేశంలో మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి, ఇన్‌స్పెక్టర్ పరశురాంతో కలిసి ఆయనను మంగళవారం సత్కరించారు. వారు మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ అనంతరం ప్రశాంతంగా జీవించాలని ఆకాంక్షించారు. డీఐ శ్రీనివాస్, అడ్మిన్ ఎస్సై ప్రభాకర్‌రెడ్డి, ఎస్సై సాయి కుమార్, పోలీస్ సిబ్బంది, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఏదులాబాద్‌లో శంకుస్థాపన చేస్తున్న వజ్రేష్‌యాదవ్

ఘట్‌కేసర్: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అర్హత ఉన్న పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. సోమవారం ఏదులాబాద్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, బీ బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థలం ఉండి ఇంటిని నిర్మించుకోలేని వారికి ప్రభుత్వం రూ. 5 లక్షల సాయం అందజేస్తుందని తెలిపారు. మాజీ సర్పంచ్ యాదగిరి యాదవ్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్, కుమార్‌ముదిరాజ్, నాగరాజుముదిరాజ్, సంజీవరెడ్డి, అమర్, అనిత, మాధవరెడ్డి, రాజేందర్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, అంజిరెడ్డి, ఆంజనేయులుయాదవ్, ఫరూక్, శ్రీనివాస్, మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



'బాయిస్ ఫోర్ చేంజ్' ముగింపు కార్యక్రమంలో ఉపాధ్యాయులు

ఘట్‌కేసర్: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని గురుకుల్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఏదులాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ ఉప్పల్ గురుకుల పాఠశాలలో ఈనెల 26 నుంచి ప్రారంభించిన "బాయిస్ ఫోర్ చేంజ్" కార్యక్రమం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా 9వ తరగతి విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకునే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు చూపిన మార్గంలో పయనించి జీవితంలో ఉత్తమ పౌరులుగా ఎదిగి జీవితంలో స్థిరపడాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన



కీసర: యువత డ్రగ్స్‌కి దూరంగా ఉండి ఉన్నత స్థానాలకు ఎదగాలని కీసర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం అహ్మద్‌గూడ వీఎంఆర్ గ్రామర్ స్కూల్‌లో డ్రగ్స్ నిర్మూలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యమన్నారు. యువత డ్రగ్స్ బారిన పడటం వల్ల బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులు, యువత తమ పరిసరాలు, విద్యాలయాలు, ఇతర చోట్ల వద్ద డ్రగ్స్, గంజాయి వినియోగించినా,విక్రయించినా, తరలించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్సై లక్ష్మణ్, వీఎంఆర్ స్కూల్ కరెస్పాండెంట్ మల్లికార్జున్‌రెడ్డి, హెడ్‌మాస్టర్ సుజాత, నేషనల్ బంజారా మిషన్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణనాయక్, జిల్లా అధ్యక్షులు రవిరాజ్ రాథోడ్, మురళీనాయక్, మల్లేష్, హరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యమంటే రోడ్డుపై పడేయడమా..?

ప్రజాపోరు బాట కార్యక్రమంలో ఎంపీ ఈటల ఫైర్



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

జవహర్‌నగర్: ఇందిరమ్మ రాజ్యమంటే పేదలను రోడ్డుమీద పడేయడమేనా అని, హైడ్రా పేరుతో తెలంగాణలో ప్రభుత్వం అరాచకం సృష్టిస్తున్నారని, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. సోమవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో బీజేపీ జవహర్‌నగర్ ఈస్ట్, వెస్ట్ అధ్యక్షులు కమల్, జ్యోగారావుల ఆధ్వర్యంలో ప్రజాపోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంపీ ఈటల రాజేందర్ హాజరై మాట్లాడారు. జవహర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డ్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరోవైపు రెవెన్యూ అధికారులు పేదల ఇళ్లనే టార్గెట్ చేసుకుని వారిని రోడ్డుమీద పడేయడం సిగ్గు చేటన్నారు. జవహర్‌నగర్‌లో ఎక్కువ శాతం నిరుపేదలు ఉన్నారన్నారు. 30 ఏళ్లకు పైబడి ఏర్పాటు చేసిన కాలనీలలో పాత ఇళ్లను తొలగించి కొత్త ఇళ్లను నిర్మించుకుంటే వారిని రోడ్డున పడేయడం దుర్మార్గమన్నారు.

◆ సురారం, అరుంధతీనగర్, హస్మత్‌పేట, జొన్నలబండ బస్తీలలో హైడ్రా వస్తుందని, పేదలు బిక్కుబిక్కుమంటూ కన్నీరుకారుస్తుంటే బుల్డోజర్‌కు అడ్డంగా నిలబడి పేదలకు అండగా ఉండి పోరాడుతున్నామన్నారు. రెవెన్యూ అధికారులకు డబ్బులిస్తే ఒకలాగా.. డబ్బులివ్వకపోతే మరోలాగా వ్యవహరించడం పద్ధతి కాదని ఆరోపించారు. కాప్రా తహసీల్దార్ వ్యవహారంపై మండిపడ్డారు. కూలీపనులు చేసేవారి ఇళ్ల జోలికొస్తే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదన్నారు. అనంతరం పలు సమస్యలపై ఎంపీకి వినతిపత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యేలు బేతి సుభాష్‌రెడ్డి, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర ఓబీసీ అధికార ప్రతినిధి రంగుల శంకర్, మేడ్చల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మహేందర్‌యాదవ్, అశోక్‌గౌడ్, సంతోష్, రాజు, లక్ష్మిరెడ్డి, లిఖిత తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు అభినందన



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపల్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన పంజాల రాజేష్‌ను కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు శాలువాతో సత్కరించి అభినందించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయనను కలిశారు. కాంగ్రెస్ నేతలు బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్, యాదగిరియాదవ్, అంజిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, అనిత, రాజేందర్‌గౌడ్, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, కొండల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మాధవ రెడ్డి, ఎఫ్ఏసీఎస్ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, మాజీ చైర్మన్ బిక్షపతిగౌడ్ పాల్గొన్నారు.